క్లుప్తంగా

వీఎస్‌యూలో సమీక్ష



రవిశంకర్‌ను సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)ను ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో యూనివర్సిటీ)కి చెందిన ఆచార్య కె.రవిశంకర్ మంగళవారం సందర్శించారు. విద్యా విధానాలు, పరిశోధన కార్యక్రమాలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న వనరులపై సమీక్షించారు. పరిశోధనలను మరింత ముందుకు తీసుకెళ్లడం తదితర అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్‌ను వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత సత్కరించారు.

విశ్వనాథస్వామికి రుద్రాభిషేకం



మనుబోలు: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మన్నెమల సాయిమోహన్‌రెడ్డి, సుప్రియ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవంగా అంబళ్ల పూజ



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబళ్ల పూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భక్త మండలి ఏర్పాట్లను పర్యవేక్షించింది.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



కొడవలూరు: రోడ్డు ప్రమాదంలో మహిళా ఉపాధి కూలీ తీవ్రంగా గాయపడిన ఘటన కొడవలూరు పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక దళితవాడకు చెందిన వెంపల రావమ్మ తన కుమారుడితో కలిసి బైక్‌పై ఉపాధి పనులకు బయల్దేరారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ ఎదుట బైక్‌పై నుంచి కింద పడ్డారు. ఈ తరుణంలో విడవలూరుకు వెళ్తున్న 108 ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రురాలిని అదే వాహనంలో చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. కాగా ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



పరిశీలిస్తున్న వేణుగోపాల్

కోవూరు: గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కోవూరులోని గాంధీ గిరిజన కాలనీ లేఅవుట్‌ను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్లాబ్ వేసిన ఇళ్లను వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈ మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ

తోటపల్లిగూడూరు: మండలంలోని తోటపల్లి గూడూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీని నిర్వహించారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ మానస ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మానస మాట్లాడుతూ చివరిరోజు విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తామన్నారు.

అన్నదాతలపై ప్రీమియం భారం





సాగులో ఉన్న వరి, వేరుశనగ పంటలు

- ప్రభుత్వ వింత పోకడ
- నాడు ఈ మొత్తాన్ని చెల్లించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రుణాలు రెన్యువల్ చేస్తేనే కట్టించుకుంటామంటున్న బ్యాంకర్లు
- అయోమయంలో రైతులు

పంట	బీమా మొత్తం	రైతు కట్టాల్సిన ప్రీమియం (హెక్టార్‌కు)
వరి	రూ.1.05 లక్షలు	రూ.420
పెసలు	రూ.45 వేలు	రూ.90
మినుములు	రూ.47,500	రూ.95
వేరుశనగ	రూ.75 వేలు	రూ.150
శనగ	రూ.70 వేలు	రూ.140

కొడవలూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలను రైతుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించింది. పైగా అదనంగా బీమా ప్రీమియం భారాన్ని మోపింది. దీనికి జీఎస్టీ అదనం కావడంతో అన్నదాతలు కుదేలవుతున్నారు.

నాడెంతో హాయిగా..

వాస్తవానికి 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రైతుల తరఫున ప్రీమియాన్ని చెల్లించి ఆదుకుంది. పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో ఏటా రూ.13,500 మొత్తాన్ని జమ చేస్తూ వచ్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలవుతున్నా, అన్నదాత సుఖీభవ పథకం ఊసే లేదు.

కల్లలైన రైతుల ఆశలు

ఖరీఫ్ సాగుకు రెండు నెలల ముందే కూటమి సర్కార్ కొలువుదీరడంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తారని, తద్వారా పంటల సాగుకు ఎలాంటి ఢోకా ఉండదని రైతులు భావించారు. అయితే వీరి ఆశలను ప్రభుత్వం కల్లలు చేసింది. కనీసం రబీ సీజన్ నాటికైనా పథకాన్ని అమలు చేస్తారనుకుంటే అదీ లేకుండా చేశారు. పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు ఏటా పెరగడం.. ప్రకృతి వైపరీత్యాలు.. దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో అన్నదాతలు నష్టాల పాలవుతున్నారు. భరించలేని కొందరు రైతులు వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితులూ నెలకొన్నాయి. మరి కొందరు ఎలాంటి ప్రత్యామ్నాయం లేక కష్టమైనా, నష్టమైనా వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్నారు.

ప్రీమియం చెల్లించాల్సిందే..

ఈ ఏడాది రబీ సీజన్ నుంచి రైతులే బీమా ప్రీమియాన్ని చెల్లించాలని కూటమి సర్కార్ స్పష్టం చేసింది. బీమా ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం డిసెంబర్ 15ను తుది గడువుగా ప్రకటించింది. వీటిని చెల్లిద్దామనుకున్నా, బ్యాంకుల్లో రైతులకు చేదు అనుభవమే ఎదురవుతోంది. రుణాలు రెన్యువల్ చేసుకుంటే తప్ప ప్రీమియాన్ని కట్టించుకోబోమని బ్యాంకర్లు తెగేసి చెప్తున్నారు. ఇది చేయాలంటే అన్నదాతలకు తలకుమించిన భారం. ఎక్కడో ఒక చోట అప్పు తెచ్చి మరీ రెన్యువల్ చేసుకోవాలి. ఇప్పటికే అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్న రైతులకు ఇది పెనుభారంగా మారింది. దీంతో చాలా మంది బీమాకు దూరమవుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీమాకు దూరం కావాల్సిందే



కూటమి ప్రభుత్వ నిర్ణయంతో బీమాకు రైతులు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. అన్నదాతలకు బ్యాంకుల్లో రుణాలుండటం సర్వసాధారణం. అయితే వీటిని రెన్యువల్ చేయడం తలకు మించిన భారం. రెన్యువల్ చేస్తేనే బీమా ప్రీమియాన్ని కట్టించుకుంటామని బ్యాంకర్లు చెప్పడం దారుణం.

– కలిశెట్టి వెంకయ్య, రైతు, తలమంచి

ప్రభుత్వమే భరించాలి



గత ప్రభుత్వ తరహాలోనే పంటల బీమా ప్రీమియాన్ని ప్రస్తుత ప్రభుత్వమే చెల్లించాలి. ప్రీమియం చెల్లించి బీమా పొందాలంటే రైతులకు సాధ్యం కాదు. బ్యాంకర్లు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత విధానంతో ఎక్కువ మంది రైతులు బీమాకు దూరం కావాల్సిందే.

– కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, రైతు, యల్లాయపాళెం

అమాంతం పెరిగిన పూల ధరలు

- కార్తీకం ఎఫెక్ట్
- ఈ మాసం పూర్తయ్యే వరకూ ఇదే పరిస్థితి

మండల కేంద్రంలో ధరలు (కిలో)	
చామంతి	రూ.600
బంతిపూలు	రూ.100
రోజాపూలు	రూ.400
మల్లెపూలు	రూ.300 (లీటర్)
కనకాంబరం	రూ.600
సంపంగి	రూ.200



పొదలకూరులో పూల దుకాణాలు

పొదలకూరు: పూలకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో వాటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కార్తీక మాసం ప్రారంభం నుంచి ఇష్టానుసారంగా ధరలను పెంచేశారు. వినియోగం పెరగడమే దీనికి కారణమని వ్యాపారులు అంటున్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో మోస్తరుగా ధరలుంటే మండల కేంద్రాల్లో మాత్రం అమాంతం పెంచేసి విక్రయిస్తున్నారు. ఆంక్షలు లేకపోవడంతో ఎవరి ఇష్టం మేరకు వారు పెంచేశారు. పొదలకూరు పంచాయతీ బస్టాండ్లో పూల దుకాణాలు చాలా ఉన్నాయి. ఇక్కడ ప్రతినిత్యం వ్యాపారులు పోటీపడి అమ్మకాలు సాగిస్తుంటారు. విడిపూలు, మాలలు అమ్మడంతోపాటు కొందరు ప్రత్యేక కార్యక్రమాలకు పూల అలంకరణలకు కూడా వెళ్తుంటారు. వివాహాల్లో పూల డెకరేషన్‌కు ఒక ప్రత్యేకత ఉంటుంది. దీనికి మండపాల యజమానులు రూ.లక్షల్లో వసూలు చేస్తుంటారు. ఫలితంగా పూల ధరలు పైపైకి చేరుకుంటున్నాయి.

కార్తీక మాసంలో..

పూల ధరలపై కార్తీక మాసం ఎఫెక్ట్ చాలా ఉంది. దీని ప్రారంభం నుంచి వ్యాపారులు అమాంతం ధరలను పెంచేశారు. దీనికితోడు పువ్వులు చుట్టుపక్కల గ్రామాల్లో సైతం లభ్యం కావడం లేదు. చెన్నై, బెంగళూరుల నుంచి పూలు దిగుమతి అవుతున్న నేపథ్యం ఉంది. సాధారణంగా పూల సాగును చిన్న కమతాల్లోనే రైతులు చేస్తుంటారు. పందిళ్లు, పూల మొక్కల రక్షణ కోసం పాలీహౌస్‌ల నిర్మాణం వ్యయంతో కూడుకున్న పని కావడంతో అన్నదాతలు ఆసక్తి చూపరు. పూలతోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ సబ్సిడీలను కూడా కల్పిస్తోంది. ఒక హెక్టారులో సాగు చేస్తే నుంచి రూ.16 వేలు సబ్సిడీ లభిస్తుంది.

క్రీడా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు



ప్రతిభ చూపిన విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

తోటపల్లిగూడూరు: పల్నాడు జిల్లా ఉప్పలపాడులో ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి గురుకుల క్రీడా పోటీల్లో కోడూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. క్యారమ్స్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే చెస్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. త్రో బాల్, వాలీబాల్ సీనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానం, జూనియర్ కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వివిధ క్రీడలకు నిర్వహించిన ఎంపికల్లో కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థినులు అండర్ – 19 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని మంగళవారం కళాశాలలో సన్మానించారు. ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ మాట్లాడారు. కార్యక్రమంలోపీడీ మౌనిక, పీఈటీ హేమలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



మాట్లాడుతున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

మనుబోలు: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వారిలో పఠనాసక్తిని పెంపొందించాలన్నారు. పిల్లలు బడి మానేసే పరిస్థితి వస్తే వారి తల్లిదండ్రులతో మాట్లాడి డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంఈఓ – రమేష్‌కుమార్, హెచ్‌ఎం వసంతకుమారి, కోర్స్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



పాఠశాలలో కళాజాత

తోటపల్లిగూడూరు: మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని మంగళవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్‌ఆములూరు పంచాయతీ కార్యదర్శి విజయదుర్గ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాజాత బృందం చేతుల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్‌బాషా, సచివాలయ సిబ్బంది సునీత, ఉపాధ్యాయులు హెప్సీ, విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతోనే విజ్ఞానం



బుచ్చిరెడ్డిపాళెం: పుస్తక ప్రదర్శన



విడవలూరులో..

బుచ్చిరెడ్డిపాళెం: పుస్తకాలతోనే విజ్ఞానమని నెల్లూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని గోపాలకృష్ణయ్య స్కూల్లో గల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను మంగళవారం ఆయన ప్రారంభించారు. కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్, ప్రిన్సిపల్ సురేఖ, ఉపాధ్యాయులు ఆమని, గిరిజ, అనిత విజయలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: గ్రంథాలయ వారోత్సవాలతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని యల్లాయపాళెం హైస్కూల్ హెచ్‌ఎం మోహన రామలింగయ్య పేర్కొన్నారు. హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను స్థానిక గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు కట్టా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు కవిత, పుష్పాంజలి వ్యవహరించారు. తొలుత ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, రంగవల్లులు, క్విజ్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి నిరూప, మహిళా పోలీస్ రమ్య పాల్గొన్నారు.

- వెంకటాచలం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన వెంకటాచలంలోని లైబ్రరీలో మంగళవారం ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి అరుణ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయురాలు అంతిమ పాల్గొన్నారు.



కొడవలూరు: యల్లాయపాళెంలో..



ఇందిరా గాంధీకి నివాళులు

పాఠశాలలో సామగ్రి ధ్వంసంపై ఫిర్యాదు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సామగ్రిని ధ్వంసం చేశారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి గదుల తలుపులు, తాగునీటి కుళాయిలు, కిటికీలను ధ్వంసం చేశారని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: మండలంలోని మాచర్ల వారిపాళెం, వరకవిపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శిరీషారాణి మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. సాగుకు ముందుగా విత్తనశుద్ధి చేపడితే వరి సాగులో చీడపీడలను నివారించవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం మూలంగా భూసారం నశించి పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందని, ఈ పరిస్థితిలో పచ్చిరొట్టి విత్తనాలైన సేంద్రియ ఎరువుల వినియోగం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో వీఏఏలు విద్యాసాగర్, వైష్ణవి, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ శివనాయక్ మాట్లాడుతూ వరి నాట్లు వేసే ముందు రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ షేక్ జహీర్, కనుపూరు కెనాల్ మాజీ అధ్యక్షుడు వెందోటి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ఇందుకూరుపేట: వరి సాగులో యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏడీలు శేషగిరిరావు, నర్సోజీ పేర్కొన్నారు. మండలంలోని మైపాడు, కొరుటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను స్థానిక ఏడీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడీ రఘునాథ్‌రెడ్డి, వీఏఏలు నరహరి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.
- కొడవలూరు: ప్రధాన పొలంలోని దుక్కిలో మోతాదులోనే ఎరువులను వినియోగించాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని రామన్నపాళెం, ఆలూరుపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు పృథ్వి, నిహారిక, వీహెచ్‌ఏలు సుప్రియ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



సూచనలిస్తున్న ఉమా

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను శ్రద్ధగా చూసుకోవాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రేబాల సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పరిధిలో గల పోలినాయుడుచెరువు తదితర ప్రాంతాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. గర్భిణుల ఇళ్లకెళ్లి వారికి సూచనలు చేశారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న కిశోర్

కోవూరు: మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోవూరు ఎక్సైజ్ సీఐ కిశోర్ కోరారు. కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను వివరిస్తూ వీడియో రూపంలో కోవూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటచలపతి అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, ఎక్సైజ్ ఎస్సై గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో ఎంతో ఉపయోగం



మాట్లాడుతున్న గుర్రప్ప

బుచ్చిరెడ్డిపాళెం: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సహకార సంఘాలు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని జిల్లా సహకార శాఖ అధికారి గుర్రప్ప పేర్కొన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని వవ్వేరు కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్, బుచ్చిరెడ్డిపాళెం కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ సంయుక్తంగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. బ్యాంకుల పర్సన్ ఇన్‌చార్జ్‌లు సుబ్రహ్మణ్యం, నిర్మల, జిల్లా సహకార ఆడిట్ అధికారి తిరుపతయ్య, డివిజనల్ అధికారులు సుధాభారతి, సుభాషిణి, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారులు శ్రీనివాసులు, సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులు, ఉపాధ్యాయులు

మనుబోలు: ఒకేషనల్ కోర్సులు చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ అన్నారు. పారిశ్రామిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం గూడూరులోని ఓ బ్యూటీపార్లర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ కోర్స్ టీచర్ కృష్ణవేణి మాట్లాడుతూ బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సులకు భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన



కొడవలూరు: బాల్య వివాహాలతో బాలికల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి గీత పేర్కొన్నారు. బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని గుండాలమ్మపాళెం, నీలగిరి సంఘం గిరిజన కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, సర్పంచ్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ప్రశంసాపత్రం



బుచ్చిరెడ్డిపాళెం: చేతుల పరిశుభ్రత తదితరాలపై పిల్లలకు అవగాహన కల్పించిన పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కు ప్రశంసాపత్రాన్ని మంగళవారం అందజేశారు. పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్‌కుమార్ మాట్లాడారు. గ్రామాలయ వ్యవస్థాపకుడు దామోదరన్, రవి భట్నాగర్ ప్రశంసాపత్రాన్ని పంపారని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు సుజాత, సీఆర్‌ఎమ్టీలు మల్లేశ్వర్‌రెడ్డి, మాల్యాద్రి పాల్గొన్నారు.